www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 6 అక్టోబర్ 2024

5

పశ్చిమ గోదావరి



మంతెన రామరాజుకు పొత్తూరి సత్కారం

ప్రజాశక్తి - నరసాపురం

ఎపిఐఐసి ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఉండి మాజీ ఎంఎల్‌ఎ మంతెన రామరాజుకు టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరసాపురం నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు సహకారం అందించాలని పొత్తూరి కోరారు. మంతెన రామరాజుకు పొత్తూరి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం పట్టణాధ్యక్షులు జక్కం శ్రీమన్నారాయణ, మొగల్తూరు మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, నరసాపురం మండల అధ్యక్షులు వాతాడి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రామరాజును శాలువతో సత్కరిస్తున్న పొత్తూరి

ఇసుకపై చేతులెత్తేశారు..!

ఆన్‌లైన్‌లో బుకింగ్‌కాని పరిస్థితి

ఏ స్టాక్ పాయింట్‌లో చూసినా 'నో శ్యాండ్' అంటూ దర్శనం

ఏలూరు జిల్లాలో ఏకైక స్టాక్ పాయింట్‌లోనూ అదే పరిస్థితి

ఇసుక కోసం నిర్మాణదారుల నానావస్థలు


పనుల్లేక భవన నిర్మాణ కార్మికుల పస్తులు

'నా పేరు వెంకటేశ్వరరావు. నిడమర్రు మండలం. ఇసుక కోసం నాలుగైదు రోజులుగా ప్రయత్నిస్తున్నాను. ఆన్‌లైన్‌లో బుకింగ్ కావడం లేదు. నోశ్యాండ్ అని చూపిస్తోంది. ఇంటి నిర్మాణ పనులు ఆగిపోయాయి. కొద్దిరోజుల క్రితం అధిక ధర చెల్లించి లోడు ఇసుక తెచ్చాను. ఇప్పుడు అసలు ఇసుకే దొరకని పరిస్థితి నెలకొంది'.

'నా పేరు కిషోర్, నిడమర్రు మండలం. ఇసుక కోసం ఆన్‌లైన్‌లో ప్రయత్నిస్తున్నా బుకింగ్ కావడం లేదు. ఇసుక కొరత సమస్య తీవ్రంగా మారింది. నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. వెంటనే ఇసుక సరఫరా సాఫీగా సాగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.'

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న వెంకటేశ్వరరావు, కిషోర్‌లే కాదు.. రెండు జిల్లావ్యాప్తంగా ఇసుక కోసం నిర్మాణదారులంతా పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఇసుక అందించలేక ప్రభుత్వం చేతులెత్తేసిన పరిస్థితి నెలకొంది. ఆన్‌లైన్‌లో అట్టహాసంగా ఇసుక బుకింగ్ ప్రారంభించిన కొద్దిరోజులు గడవకముందే పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఉచిత ఇసుక అంటూ ప్రభుత్వం తమను నిలువునా ముంచేసిందని నిర్మాణదారులు గగ్గోలు పెడుతుండగా, తమకు ఉపాధి లేకుండా పోయిందని భవన నిర్మాణ కార్మికులు లబోదిబోమంటున్నారు. అధికారం చేపట్టి దాదాపు నాలుగు నెలలు కావొస్తున్నా ఇప్పటికీ ఇసుక సరఫరాపై ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోలేకపోయింది. ఇసుక దొరకక రెండు జిల్లాల్లోని ప్రజలు పడుతున్న అవస్థలు అత్యంత దారుణంగా మారాయి. ఏలూరు జిల్లాలో ఉంగుటూరు మండలం చేబ్రోలు, కుక్కునూరు మండలంలో ఇబ్రహీంపేట, విజయరాయిలో మొత్తం మూడు స్టాక్ పాయింట్లు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. తొలి నుంచి చేబ్రోలు, విజయరాయి స్టాక్ పాయింట్లు ఇసుక లేకుండాపోయింది. ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్‌లో 72 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉన్నట్లు అధికారులు చెప్పారు. ఇప్పుడు అక్కడ కూడా ఇసుక లేదని ఆన్‌లైన్‌లో చూపిస్తున్న పరిస్థితి ఉంది. సెప్టెంబర్ 19న ఇసుక ఆన్‌లైన్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పట్టుమని 15 రోజులు గడవక ముందే ఆన్‌లైన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. పశ్చిమగోదావరి జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్లు లేకపోవడంతో తూర్పుగోదావరి జిల్లాలోని పందలపర్రు, పెండ్యాల, రాజమండ్రి వంటి ఇసుక స్టాక్ పాయింట్లలో ఇసుక తెచ్చుకోవచ్చని అధికారులు తెలిపారు. ఆన్‌లైన్‌లో తెరిస్తే మాత్రం తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని స్టాక్ పాయింట్లలోనూ నో శ్యాండ్ అంటూ చూపిస్తున్న పరిస్థితి ఉంది.



నోశ్యాండ్ అంటూ ఆన్‌లైన్‌లో చూపుతున్న సందేశం

ఇసుక బుకింగ్ కోసం ప్రయత్నిస్తున్న వారికి ఆన్‌లైన్‌లో వస్తున్న సందేశం ఏమిటంటే 'ప్రభుత్వం ఎంపిక చేసిన స్టాక్‌యార్డ్‌లో ఇసుక స్టాక్ అందుబాటులో లేదు. దయచేసి మళ్లీ ఇసుక బుకింగ్ చేయడానికి ప్రయత్నించండి' అని చూపిస్తోంది. దీంతో నిర్మాణదారులకు ఏం చేయాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో 20 టన్నుల ఇసుక రూ.18 వేలకు లభించగా, ఈ ప్రభుత్వం ఉచిత ఇసుక అని చెబుతూ 20 టన్నులకు రూ.23 వేలు వసూలు చేస్తోంది. డబ్బులు ఎక్కువైనా ఇసుక దొరికితే చాలనుకుని నిర్మాణదారులు ముందుకొచ్చినా ఇసుక కూడా అందించలేని పరిస్థితికి ప్రభుత్వం చేరింది. దీంతో జనం నుంచి తీవ్ర ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తుతున్నాయి.

పనుల్లేక కార్మికుల పస్తులు

ఇసుక లేకపోవడంతో భవన నిర్మాణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో భవన నిర్మాణ కార్మికులకు పనుల్లేకుండా పోయాయి. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలకు ఇది పెనుశాపంగా మారింది. ప్రభుత్వాలు మారినా భవన నిర్మాణ కార్మికుల కష్టాలు మాత్రం తీరని పరిస్థితి ఉంది. రెండు జిల్లాల్లో దాదాపు రెండు లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. ఇసుక సరఫరాలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు జనంలో చర్చనీయాంశమైంది. ఇంటి నిర్మాణం చేసుకుంటున్న సామాన్య ప్రజానీకం పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. అధిక ధరకు ఇసుక కొనుగోలు చేయలేక, మరోపక్క ఇసుక దొరకక ఇంటి నిర్మాణ పనులు నిలిపేయాల్సిన దుస్థితి దాపురించింది. జిల్లాలోని మైనింగ్ అధికారులు సైతం సరిగా స్పందించని పరిస్థితి నెలకొనడంతో అంతటా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఉచిత ఇసుక హామీని అమలు చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నాలు

ప్రజాశక్తి - భీమవరం

కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన ఆందోళనలు నిర్వహించారు. స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో శనివారం కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా ప్రజలకు ఇసుక అందుబాటులో లేకపోవడం దారుణమని విమర్శించారు. ఇళ్ల నిర్మాణదారులు అధిక ధరలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే లబ్ధిదారులకు ఇసుక ఉచితంగా అందించాలని డిమాండ్. చేశారు. బహిరంగ మార్కెట్లో ట్రాక్టర్ ఇసుక



ఆచంటలో..

రూ.7 వేలు పలుకుతుందని, పది యూనిట్లు లారీ రూ.30 వేల వరకు అమ్ముతున్నారని, తక్షణం బ్లాక్ మార్కెట్ అరికట్టాలని కోరారు. రాత్రి సమయంలో ఇసుక దోపిడీ సాగుతుందని, దీన్ని ప్రభుత్వం అరికట్టాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలపై భారాలు తగ్గించాలని కోరారు. ప్రభుత్వానికి మద్యం మీద ఉన్న శ్రద్ధ ఇసుక పాలసీపై లేదని లేదని విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సిపిఎం నాయకులు ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, కె.కృష్ణ, కె.అప్పన్న, రాజు, డి.త్రిమూర్తులు, చెన్నారావు పాల్గొన్నారు.


ఆచంట: నియోజకవర్గంలో ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ కార్మికులకు పనుల్లేక మూడు నెలలుగా అనేక ఇబ్బందులు పడుతున్నారని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా నాగాంజనేయులు అన్నారు. మెమో 1214ని రద్దు చేసి బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు కార్యకలాపాలు పునరుద్ధరించి, వెల్ఫేర్ క్లెయిములను పరిష్కరించాలన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి అనంతరం తహశీల్దార్ సోమేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తానేలంక లక్ష్మీనారాయణ, సానబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, సిర్రా నర్సింహమూర్తి, తలుపురి బుల్లబ్బాయి, కుసుమ జయరాజు, మోటూరి లింగయ్య పాల్గొన్నారు.



భీమవరంలో నినదిస్తున్న నేతలు, కార్మికులు

పెనుగొండ: ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడంతో పాటు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు వ్యతిరేకంగా గత ప్రభుత్వం తీసుకువచ్చిన మెమో 1214ను రద్దు చేసి బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు కార్యకలాపాలు పునరుద్ధరించి, వెల్ఫేర్ క్లెయిములను అమలు చేయించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో షేక్ పాదుషా, నీలాపు ఆదినారాయణ, రాజమహేంద్రవరం వెంకటేష్, నాగిశెట్టి గంగారావు, భవన నిర్మాణ కార్మికులు గుర్రాల సత్యనారాయణ, లింగోలు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కాళ్ల: ఉచిత ఇసుక అమలు చేయకపోవడంతో భవన నిర్మాణ కార్మికుల జీవితాలు రోడ్డున పడ్డాయని సిఐటియు మండలాధ్యక్షులు గొర్ల రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఉచిత ఇసుక హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ధర్నా నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా



కాళ్లలో..

కార్యదర్శి మండల సూరిబాబు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక రంగాన్ని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత ఇసుకను విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పసుపులేటి సత్యనారాయణ, పుట్టబోతుల మధు, వెంకటేశ్వరరావు, బాబి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తిరుమాని శ్రీను, కెవిపిఎస్ నాయకులు దాసి బాలయ్య, ముక్కల ఆజమ్మ తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో ప్రజాగళాన్ని వినిపిస్తా

పిడిఎఫ్ టీచర్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - యలమంచిలి

చట్టసభల్లో ప్రజాగళాన్ని విన్పిస్తానని ఉభయగోదావరి జిల్లాల పిడిఎఫ్ టీచర్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి అన్నారు. టీచర్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అకాల మరణంతో ఖాళీ అయిన ఎంఎల్‌సి స్థానానికి యుటిఎఫ్ మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థిగా యలమంచిలి మండలం నార్నిమెరక గ్రామానికి చెందిన బొర్రా గోపీమూర్తి అభ్యర్థిత్వం ఖరారైంది. విద్యార్థి దశ నుండి ఉద్యమాల్లో చురుగ్గా ఉన్న గోపీమూర్తి 1998లో ఉపాధ్యాయ వృత్తి చేపట్టి యుటిఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శిగా, జిల్లా కార్యదర్శిగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించి ప్రస్తుతం రాష్ట్ర కోశాధికారిగా ఉన్నారు. ప్రస్తుతం అత్తిలి మండలం కొమ్మర జెడ్‌పి హైస్కూల్లో మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. గుంటూరులో శుక్రవారం జరిగిన యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో బొర్రా గోపీమూర్తిని అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు. ఈ నేపథ్యంలో యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఎన్నికల ప్రచారాన్ని గోపీమూర్తి స్వస్థలం నార్నిమెరక గ్రామ పంచాయతీ గమల్లపెంట నుండి శనివారం లాంఛనంగా ప్రారంభించారు. తొలుత స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, కీర్తిశేషులు షేక్ సాబ్జీ చిత్రపటానికి నివాళులర్పించి లాంఛనంగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాజ్యాంగం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గోపీమూర్తి

చేసుకుని చట్టసభల్లో రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. సామాన్య ప్రజల గొంతుకను చట్టసభల్లో విన్పిస్తానని, పిడిఎఫ్ సభ్యుల వారసత్వాన్ని కొనసాగిస్తానని, నీతి నిజాయతీలతో పని చేస్తానని హామీ ఇచ్చారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం మాట్లాడుతూ ఇంకా నమోదు చేసుకోవాల్సిన ఉపాధ్యాయులు ఈ నెల 15వ తేదీలోగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.క్రాంతికుమార్, ఎస్.రత్నరాజు, ఎం.శ్రీనిబాబు, రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి.రాజశేఖర్, సిఐటియు నాయకులు దేవ సుధాకర్, యుటిఎఫ్ నాయకులు పంతం రామ్మూర్తి నాయుడు, దాసరి క్షేమమూర్తి, సిహెచ్.శ్రీధర్, బి.నాగబాబు, పి.శ్రీనివాసరావు, జి.అబ్రహం, కె.త్రిమూర్తులు, పివి.రమణరాజు, కుడుపూడి సత్యనారాయణ, రామేశ్వరపు సత్యనారాయణ, చింత సత్యనారాయణ, ఎం.శ్రీధర్, ఎం.బాపిరాజు, జెఆర్‌వి.నాగేశ్వరరావు, వలవల మురళీధర్, వలవల వీర వెంకట సుబ్బారావు, కట్టుపాలెం సర్పంచి పొన్నమండ నాగరాజు, జైభీమ్ ఫౌండేషన్ అధ్యక్షులు జి.సునీల్‌గవాస్కర్, వలవల విష్ణు బాలాజీ, రాఖీ, బొర్రా రవి తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం: పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ శాసన మండలిలో ప్రజల తరఫున గళమెత్తడంలో ముందుంటారని పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి అన్నారు. స్థానిక యుటిఎఫ్ భవనంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం.మార్కం డేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారిగా పని చేస్తున్న తాను సంఘం పిలుపుమేరకు ఎంఎల్‌సి అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నట్లు తెలిపారు. తొలుత యుటిఎఫ్ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కీర్తిశేషులు షేక్ సాబ్జీ, పోలిశెట్టి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, జిల్లా అధ్యక్షులు పి.విజయరామ రాజు, నేతలు ఎన్‌వి.సత్యనారాయణ, ఎం.మాణిక్యాలరావు, సిహెచ్.కృష్ణమోహన్, ఆర్‌ఆర్‌కె.రాజు, పి.శాంసన్ పాల్గొన్నారు.

డ్వాక్రా యానిమేటర్లపై వేధింపులు ఆపాలి

పర్మినెంట్ చేసి, వేతన బకాయిలు విడుదల చేయాలి

యానిమేటర్ల సంఘం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

డ్వాక్రా యానిమేటర్లపై రాజకీయ వేధింపులు అరికట్టాలని, వేతన బకాయిలు విడుదల చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని డ్వాక్రా యానిమేటర్లు డిమాండ్ చేశారు. యానిమేటర్ల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.నిర్మల మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత రాజకీయ వేధింపులు పెరిగాయన్నారు. వేధింపులు తట్టుకోలేక మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. జిల్లాలో డ్వాక్రా యానిమేటర్లకు వేతనాలు పెండింగ్ ఉన్నాయని, తక్షణమే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాల పరిమితి సర్క్యులర్ పేరుతో కొంతమంది అధికారులు యానిమేటర్లు, ఆర్‌పిలపై ఒత్తిడి చేస్తున్నారని, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ అదుపు చేయలేని స్థితి ఉందని అన్నారు. డ్వాక్రా యానిమేటర్లకు కనీస ఉద్యోగ భద్రత, కనీస వేతనం లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ సభలకు ప్రజలను కదిలించడం, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, డ్వాక్రా గ్రూపుల నిర్వహణ, గ్రామ సంఘాల నిర్వహణ, పొదుపు వంటి అనేక విధులను నిర్వహిస్తున్నప్పటికీ గుర్తింపు లేని పనిగా ఉందన్నారు. సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ డ్వాక్రా యానిమేటర్లను పని ఒత్తిడికి గురిచేసి ప్రభుత్వం తన అవసరాలకు వాడుకోవడం తప్ప వారి సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు. అరకొర వేతనాలతో తమ కుటుంబాలను



ధర్నాలో నినదిస్తున్న యానిమేటర్లు

పోషించుకుంటూ ఏళ్ల తరబడి పని ఒత్తిడిని తట్టుకుంటూ పని చేస్తున్నప్పటికీ ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించకపోవడం దారుణమన్నారు. యానిమేటర్లపై రాజకీయ వేధింపులకు దిగడం అత్యంత దారుణమైన విషయమన్నారు. తక్షణమే జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గోవిందమ్మ, లక్ష్మి, లత, మేరీ కుమారి, లక్ష్మీ భవాని, దుర్గ, నాగలక్ష్మి, పద్మావతి పాల్గొన్నారు.

తల్లీ బిడ్డ మరణాలు సంభవిస్తే సహించం

గతేడాదితో పోలిస్తే మాతృ మరణాల సంఖ్య అధికం

ఏడు వేల మందికి పౌష్టికాహార లోపం దురదృష్టకరం

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో వైద్య లోపంతో ఏఒక్క తల్లీ బిడ్డ మరణించరాదని, మరణాలు సంభవిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో వైద్యఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బందితో సంయుక్త సమావేశం ఏర్పాటు చేశారు. ఆయా శాఖల లక్ష్యాలు, సాధన అంశాలపై క్షుణ్ణంగా సమీక్షించి ఆమె మాట్లాడారు. ప్రభుత్వ హాస్పటల్స్ వైద్యులు సమయపాలన తప్పక పాటించాలని, ఏదైనా ప్రయివేట్ ప్రాక్టీస్ ఉంటే వాటిని వదిలి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఉద్ఘాటించారు. పిహెచ్‌సిలో మెడికల్ అధికారులు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు కచ్చితంగా అందుబాటులో ఉండాలన్నారు. సంబంధిత వైద్యాధికారి స్థానికంగానే నివాసం ఉండాలన్నారు. జిల్లాలో ఏప్రభుత్వ ఆసుపత్రిలోనైనా డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదు వస్తే ఒక హెచ్చరిక అనంతరం సంబంధిత వైద్యునిపై కచ్చితంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తనకు వైద్యులు అంటే చాలా గౌరవం అని, చర్యలు తీసుకునే పరిస్థితి ఎవరో తెచ్చుకోవద్దని హితవు పలికారు. పేద, మధ్యతరగతి ప్రజలు మాత్రమే వైద్యం కోసం వస్తారని, వారిని ఆప్యాయంగా పలుకరించి, మెరుగైన వైద్యంతో ధైర్యం ఇవ్వాలని సూచించారు. జిల్లాలో మాతృ మరణాల సంఖ్య గతేడాదితో పోలిస్తే అధికంగా ఉందన్నారు. వైద్యశాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పని చేసి మాతృ, శిశుమరణాలను నూరుశాతం అరికట్టాలన్నారు. జిల్లాలో సుమారు ఏడు వేల మంది పోషకాహార లోపంతో ఇబ్బంది పడుతున్నట్లు నివేదికల్లో ఉండటం దురదృష్టకరమన్నారు. జిల్లాలోని ఎరుకుల, యానాది కుటుంబాల్లోని పిల్లలు పౌష్టికాహార లోపం కలిగి ఉంటారని, వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారి బి.సుజాతరాణి, జిల్లా టిబి, లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ భానునాయక్, అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ వి.ప్రసాద్, భానునాయక్, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ కీర్తి శ్రవణ్, డిపిహెచ్ఎన్ ఒ.వెంకటరత్నం, డిపిఎంఒ ధనలక్ష్మి, ఆర్‌బిఎస్‌కె జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.భావన, ఎస్ఒ ప్రసాద్, డిప్యూటీ డెమో పి.అనంతలక్ష్మి, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ తోట కళ్యాణికుమారి, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, పిహెచ్‌సిల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రత్యేక హోదా కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

టిడిపి కూటమి ప్రభుత్వానికి సిపిఎం విజ్ఞప్తి

ప్రజాశక్తి - పెనుగొండ

అన్నివిధాలా నష్టపోయిన రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనకు అధికార టిడిపి కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. సిద్ధాంతంలోని ఆర్‌కె ఫంక్షన్ హాలులో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత అన్నివిధాలా నష్టపోయిన రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనపై టిడిపి కూటమి, ప్రతిపక్ష వైసిపి తమ వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. టిడిపి, జనసేన, వైసిపి రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాల కోసమే చూస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీలు అమలు చేయాలన్నారు. నిధులను వెంటనే మంజూరు చేయాలన్నారు. రాజ్యసభలో వైసిపి, లోక్ సభలో టిడిపి, జనసేనకు మెజార్టీ ఉన్నా కేంద్రాన్ని నిలదీసేందుకు భయపడుతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో టిడిపి కీలక పాత్ర పోషించిందని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎందుకు కృషి చేయడం లేదని ప్రశ్నించారు. ఆదుకోవాల్సిన కేంద్రం రాష్ట్రానికి రూ.15 వేల కోట్లు కేవలం అప్పుగానే ఇవ్వడం అన్యాయమన్నారు. పోలవరం పూర్తి చేసే బాధ్యతను టిడిపి కూటమి తీసుకుందని, అందులో ముఖ్యమైన ముంపు ప్రాంతాల ప్రజలకు పునరావాసం కల్పించాలన్నారు. విశాఖ రైల్వేజోన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, చింతకాయల బాబూరావు, పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు సూర్నీడు వెంకటేశ్వరరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, ఎం.వైకుంఠరావు, ముచ్చర్ల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బలరాం

గీత కార్మిక పారిశ్రామిక ఆర్థిక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కల్లుగీత కార్మిక సంఘం

ప్రజాశక్తి - తణుకు

గీత కార్మిక పారిశ్రామిక ఆర్థిక కార్పొరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ఎపి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అమరవీరుల భవనంలో కల్లుగీత కార్మిక సంఘం తణుకు డివిజన్ సమావేశం కడలి బాలాజీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ.. కల్లుగీత వృత్తిని రాష్ట్ర ప్రభుత్వం రక్షించాలిగానీ భక్షించరాదన్నారు. గీత కార్మికులకు అక్టోబరులో ప్రకటించాల్సిన పాలసీని ప్రకటించలేదన్నారు. గీత కార్మికులకు లేని ఆశను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తూ లిక్కరు షాపుల్లో 10 శాతం ఇస్తామని ప్రచారం చేశారని, కానీ అదేమీ ప్రకటించకుండా గీత కార్మికుల్లో చంద్రబాబు అలజడి సృష్టిస్తున్నారని విమర్శించారు. గీత వృత్తికి సమగ్ర చట్టాన్ని చేసి కల్లుగీత వృత్తిని రక్షిస్తే గీత కార్మికులకు ప్రభుత్వం ఏమీ చేయనవసరం లేదన్నారు. గీత కార్మికులకు వడ్డీ లేని రుణాలు బ్యాంకుల ద్వారా కల్పించాలని, కల్లును శీతల పానీయంగా గుర్తించాలని, కల్లును ఆధునికీకరణ ప్రభుత్వం చేయాలని, సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో గుబ్బల వీరరాఘవులు, కట్టా వెంకటేశ్వరరావు, చిట్టూరి ఆదినారాయణ, బొర్రా సత్యనారాయణ, కడలి సుబ్బారావు, పాలా సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కామన మునిస్వామి

వైసిపి హయాంలో ఉపాధ్యాయులకు అవమానం

మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శ

ప్రజాశక్తి - పాలకొల్లు

ఉపాధ్యాయులను గత వైసిపి ప్రభుత్వం అగౌరవపరిస్తే కూటమి ప్రభుత్వం గౌరవిస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంత్రి ఆధ్వర్యంలో ధర్మారావు ఫౌండేషన్ తరపున 125 మంది ఉత్తమ ఉపాధ్యాయులను రామచంద్ర గార్డెన్స్‌లో శనివారం రాత్రి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయులను వైన్ షాపులు, సినిమా థియేటర్ల దగ్గర కాపలా పెట్టి అవమానించిందన్నారు. డిఎస్‌సి నిర్వహించకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న మంత్రి రామానాయుడు

కొరిన మిల్లుకు ధాన్యం తోలుకోవచ్చు

తేమ శాతం 17కే పరిమితం


ప్రజాశక్తి - ఆకివీడు

రైతులు సార్వా పంట ధాన్యాన్ని తాము కోరుకున్న మిల్లుకు తోలుకోవచ్చని మండల వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కెవిఎస్ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో రెండో ఫేస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖాధికారి ఎ.ప్రియాంక మాట్లాడుతూ ధాన్యం రైతులు కోరుకున్న మిల్లుకే రాశి పంపించాలని ఆమె కొనుగోలు కేంద్ర నిర్వాహకులకు సూచించారు. తేమ శాతం మాత్రం 14 శాతం నుంచి 17 శాతం వరకు మాత్రమే అనుమతి ఇస్తారని ఆమె చెప్పారు. కామన్ ధాన్యం క్వింటాలు ధర రూ.2,300, ఏ గ్రేడ్ ధాన్యం రూ.2,320 నిర్ణయించారని చెప్పారు. గోనెసంచులు రైతులు రైతు సేవా కేంద్రాల నుంచి పొందవచ్చన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ సిబ్బంది అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వీరవాసరం ఎంపిడిఒగా కిరణ్‌కుమార్

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం ఎంపిడిఒగా కె.కిరణ్‌కుమార్, పంచాయతీ విస్తరణ అధికారిగా ఎవిఎస్ ఆర్ఎస్.కొండలరావు శని వారం బాధ్యతలు చేపట్టారు. ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డిలు ఎంపిపి వీరవల్లి దుర్గాభవానిని మర్యాద పూర్వకంగా కలవగా ఆమె వారికి సాదరంగా స్వాగతం పలుకుతూ అభినందించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎంపిడిఒను సచివాలయం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు.



కిరణ్‌కుమార్‌ను అభినందిస్తున్న ఎంపిపి

అంగన్వాడీ పోస్టు నోటిఫికేషన్ రద్దు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఖాళీగా ఉన్న స్థానిక మండలంలోని మల్లిపూడి-1 అంగన్వాడీ కేంద్రం కార్యకర్త పోస్టు నియామకం కోసం లోగడ ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్లు పెనుమంట్ర ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ అంగర కృష్ణకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పేద అర్చకులను ఆదుకున్న టిడిపి కూటమి

తోట సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రాష్ట్రంలోని చిన్న ఆలయాల్లో ధూప, దీప, నైవేద్య సహాయాన్ని పెంచినందుకు భీమవరం పట్టణ బ్రాహ్మణ అర్చకులు హర్షం వ్యక్తం చేశారు. టిడిపి భీమవరం నియోజకవర్గ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు నిర్వహించిన సమావేశంలో టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీలో భాగంగా రాష్ట్రంలోని 5400 చిన్న ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యం కోసం రూ.పది వేల సహాయాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం పెంచి పేదబ్రాహ్మణ అర్చకులను ఆదుకోవడం అభినందనీయమన్నారు. టిడిపి బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనర్ చెరుకువాడ సంతోష్ కుమార్ మాట్లాడుతూ భీమవరంలో నిర్వహించిన యువగళం పాదయాత్రలో నారా లోకేష్ చిన్న దేవాలయాల ధూప, దీప, నైవేద్యాలు పేద అర్చకుల జీవనోపాధి పెంపొందించాలని అర్జీ సమర్పించామని, అందుకు స్పందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాలకు పేద బ్రాహ్మణ అర్చకులకు సహాయం అందించినందుకు టిడిపి కూటమి ప్రభుత్వానికి, చంద్రబాబునకు, లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వైసిపి నుంచి పెంచిన పాల్గొని పవన్ శర్మ టిడిపిలో చేరారు. ఆయనకు తోట సీతారామలక్ష్మి టిడిపి కండువా వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, గూడూరి సుబ్బారావు, కార్యదర్శి నేదునూరి గంగాధర్ తిలక్, టిడిపి పట్టణ మహిళా అధ్యక్షురాలు ఎండి షబీనా, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సయ్యద్ నసీమా బేగం, బ్రాహ్మణ సమైక్య నాయకులు మిర్తిపాటి గున్నేశ్వరరావు, వేలూరి శ్రీధర్, వేలూరి కిరణ్, మార్కండేయ అఖిలేష్, వేలూరి బుజ్జి, మైలవరం మణికంఠ, కొండేపూడి మణికంఠ పాల్గొన్నారు.

వృత్తి వ్యాపారాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - గణపవరం

విద్యార్థులు విద్యతో పాటు వృత్తి వ్యాపారాలపై అవగాహన కలిగి ఉండాలని గణపవరం బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెబి.భాస్కరరావు అన్నారు. సమగ్ర శిక్షణ సెంటమ్ పర్స్ సెల్యూ ఇండియా లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో పది రోజులు జరిగే ఇంటర్న్‌షిప్‌లో భాగంగా పశ్చిమ జిల్లా పరిషత్ బాలికల హైస్కూలుకు చెందిన విద్యార్థులకు వృత్తి, విద్య అనే అంశంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక భాస్కర్ హోల్‌సేల్, రిటైల్ బట్టలషాపులో వ్యాపారంగంపై అవగాహన కల్పించారు. భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వృత్తి వ్యాపారాలపై అవగాహన కలిగి ఉంటే భవిష్యత్తులో అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హిమగిరి, సీత, ప్రసంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

మంతెన రామరాజుకు అభినందనలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎపిఐఐసి ఛైర్మన్‌గా మంతెన రామరాజు శనివారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా టిడిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు కర్నేన గౌరునాయుడు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్‌పర్సన్ కర్నేన రోజా రమణి అభినందనలు తెలిపారు.

ఉండి విద్యుత్ శాఖ సహాయక ఇంజినీర్‌గా రాంబాబు

ప్రజాశక్తి - ఉండి

ఉండి మండల విద్యుత్ శాఖ సహాయక ఇంజినీర్‌గా పసుపులేటి రాంబాబు బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో భీమవరం డి3 సెక్షన్, ఆకివీడు, రాజమహేంద్రవరంలో పని చేశారు. ఈ సందర్భంగా ఉండి విద్యుత్ సిబ్బంది ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఇప్పటివరకు ఉండి ఎలక్ట్రికల్ ఎఇగా పనిచేసిన ముదునూరి మాధవరాజు భీమవరం బదిలీపై వెళ్లారు.

నేరాలు - ఘోరాలు

వ్యక్తిపై పోక్సో కేసు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలో నివాసం ఉంటున్న ప్రాంతంలోకి వెళ్లి ఎనిమిదేళ్ల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఎం.ప్రసాద్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు నరసాపురం ఎస్ఐ జయలక్ష్మి తెలిపారు. యలమంచిలి మండలం మేడపాడుకు చెందిన ప్రసాద్ మద్యం మత్తులో తిరుగుతూ తెల్లవారుజామున తలుపు తీసి ఉన్న ఇంట్లోకి ప్రవేశించాడన్నారు. ఆ సమయంలో బాలికపై అసభ్యంగా ప్రవర్తించడంతో బాలిక కేకలు వేయడంతో పారిపోతున్న ప్రసాద్‌ను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కేసును విచారించి నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు.

ఇసుక లారీలు సీజ్

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కెపిపాలెం సౌత్‌లో అనధికారికంగా ఇసుక తరలిస్తున్న మూడు లారీలను, ఒక పొక్లెయిన్‌ను సీజ్ చేసినట్లు మొగల్తూరు ఎస్ఐ జి.వాసు తెలిపారు. కెపిపాలెం బీచ్ రోడ్డులో ఇసుక అక్రమ రవాణాపై వచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం దాడి చేసి ఇసుక రవాణా చేస్తున్న మూడు వాహనాలను, లోడింగ్‌కు వినియోగిస్తున్న యంత్రాన్ని సీజ్ చేసామని వివరించారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరం పుంత రోడ్డులోని సిల్వర్ స్ప్రింగ్స్ విల్లాలో పేకాట శిబిరంపై కాళ్ల పోలీసులు శనివారం మెరుపు దాడి చేశారు. భారీగా నగదు దొరకడంతోపాటు పట్టుబడిన వారిలో పలువురు ప్రముఖులు ఉన్నట్లు సమాచారం.

బాణసంచా వ్యాపారులు లైసెన్స్ పొందాలి

ఆర్‌డిఒ దాసిరాజు

ప్రజాశక్తి - నరసాపురం

దీపావళి పండుగను పురస్కరించుకుని తాత్కాలికంగా బాణసంచా వ్యాపారులు తప్పనిసరిగా తాత్కాలిక లైసెన్స్ పొందాలని ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. డివిజన్ పరిధిలోని అధికారులకు శనివారం సమీక్ష నిర్వహించారు. లైసెన్స్ లేకుండా బాణసంచా తయారీ చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పండుగ వెళ్లే వరకు అధికారులు మండల పరిధిల్లో నిఘా ఉంచాలన్నారు. ఇటు వ్యాపారులు లైసెన్స్ తీసుకోవాలని తెలియజేయాలన్నారు. సోమవారం నుంచి ఈ నెలా 26వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్, పాన్, చలాన దరఖాస్తుకు జత చేయాలన్నారు. వ్యాపారి విధిగా జిఎస్‌టి రశీదును జత చేయాలని తెలిపారు.

సీనియర్ అసిస్టెంట్‌గా ఫణిరాజా

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం టౌన్ ఎలక్ట్రికల్ ఎఇ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా చీడే ఫణిరాజా శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పాలకొల్లు విద్యుత్ రెవెన్యూ కార్యాలయం నుంచి బదిలీపై టౌన్ ఎఇ కార్యాలయాలకు బదిలీపై వచ్చారు. టౌన్ ఎఇ ప్రభాకర్‌కు ఫణి జాయినింగ్ ఆర్డర్ అందించారు. ఈ సందర్భంగా ఫణిని జెఎఒ డి.శ్రీనివాస్, యూనియన్ నాయకులు మంతెన వెంకటేశ్వరరావు, ఆర్‌హెచ్.విద్యాసాగర్, యు.రమేష్, సిబ్బంది అభినందించారు.

యాత్రికులకు ప్రసాదం పంపిణీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం నార్త్‌లో రజకులవారివీధిలో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బూరెలు, గారెలు, పులిహోర, చక్రపొంగలి, శనగలు, సేమియా తదితర ప్రసాదాలను యాత్రికులకు పంపిణీ చేశారు. అమ్మవారికి అన్నపూర్ణ దేవి అలంకరణ చేశారు. గ్రామానికి చెందిన పేరిపాలెం శివప్రసాద్ అన్నపూర్ణ పేరుపాలెం సాయిబాబా మహాలక్ష్మి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయా ప్రసాదాలను యాత్రికులకు పంపిణీ చేశారు.

ఘనంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామంలో స్వయంభూ శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శనివారం శ్రీలక్ష్మీశరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా మూడో శ్రీ ధనలక్ష్మి అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి యాత్రికులు అలంకరణ దాతలు ఏలూరుపాడుకు చెందిన సంకా హరిశ్చంద్ర వెంకట ప్రసాద్ రామనీత దంపతులు, భీమవరానికి చెందిన అల్లూరి పద్మరాజు పద్మ దంపతులచే పూజలు నిర్వహించారు.

మహిళలకు జీవనోపాధి కల్పనకు కృషి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఆర్థిక అవసరాలకు విదేశాలకు వలస వెళ్లే అల్పాదాయ వర్గాల మహిళలను గుర్తించి సుస్థిరమైన జీవనోపాధి కల్పనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మెప్మా అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఆమె మెప్మా అధికారులతో సమావేశమై ఆ శాఖ కార్యకలాపాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చాలామంది మహిళలు ఉపాధి అవకాశాల కోసం విదేశాలకు వెళ్లి మోసపోతున్నారని, వీటిని నిరోధించడానికి అల్పాదాయ వర్గాల మహిళలకు స్థానికంగా సుస్థిరమైన జీవనోపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు మహిళల అక్రమ రవాణా, తదితర సామాజిక విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. వీధి విక్రయదారులకు సమావేశపరిచి పరిశుభ్రమైన ఆహారాన్ని తయారు చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో మెప్మా ఎ.బి.రఘునందన్, జిల్లా అధికారి జి.పార్వతి, జిల్లాలోని సిటీ మిషన్ మేనేజ్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరం

ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విద్యార్థి దశ నుండే ప్రతి విద్యార్థి ఉన్నతమైన ఆలోచనలతో నేటి సమాజానికి అవసరమయ్యే సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి అన్నారు. స్థానిక విష్ణు విద్యాసంస్థల సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోటల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్పేస్ వాక్ అవగాహనా ర్యాలీని ఆయన ప్రారంభించారు. అక్టోబర్ నాలుగో తేదీ నుంచి పదో తేదీ వరకు వరల్డ్ స్పేస్ వీక్ కార్యక్రమంలో భాగంగా అంతరిక్షం, వాతావరణ మార్పులు నినాదంతో సాగిన ర్యాలీ శ్రీ విష్ణు విద్యా సంస్థల నుంచి బివి రాజ్ విగ్రహం సెంటర్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విష్ణు స్కూల్ ప్రిన్సిపల్ బిందు, పి.ఏడుకొండలు, ఇస్రో శాస్త్రవేత్తలు, క్యాంపస్ డైరెక్టర్ అడ్మినిస్ట్రేషన్ జె.ప్రసాదరాజు, డైరెక్టర్, స్టూడెంట్ ఎఫైర్ డాక్టర్ పి.శ్రీనివాసరాజు, డిజిఎం.ఎం.రమేష్‌రాజు, బివి.రాజు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బఖర్.కృష్ణంరాజు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.


అవగాహనా ర్యాలీలో ఎస్‌పిఅద్నాన్ నయీం అస్మి

ఎపి ఇపిడిసిఎల్ డిఇఇగా మధుకుమార్ బాధ్యతలు


మధుకుమార్‌ను అభినందిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఎపి ఇపిడిసిఎల్ డిఇఇగా కొల్లాబత్తుల మధుకుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఏలూరు విజిలెన్స్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ డిఇఇగా పని చేస్తున్న సురేష్ కుమార్‌ను ఏలూరు విజిలెన్స్ స్క్వాడ్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన మధు కుమార్‌ను డివిజన్ పరిధిలోని పలువురు ఎడిలు, ఎఇలు, అభినందించారు.

రాజేంద్రప్రసాద్ కుమార్తె గాయత్రి మృతి బాధాకరం

నరసాపురం రైల్వే స్టేషన్ మాస్టార్ మధుబాబు

ప్రజాశక్తి - నరసాపురం

నటుడు రాజేంద్రప్రసాద్ కుమార్తె గాయత్రి ఆకస్మిక మరణవార్త ఎంతో బాధ కలిగించిందని నరసాపురం రైల్వే స్టేషన్ మాస్టార్ ఎస్ఎం మధుబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబంతో తనకు ఎంతో మంచి స్నేహసంబంధం ఉందన్నారు. రాజేంద్రప్రసాద్ తనకు మంచి మిత్రుడని, జిల్లాలో మీటింగులకు వచ్చినప్పుడల్లా తాను వెళ్లి కలిసేవాడినని చెప్పారు. మహానటి సావిత్రి సినిమా షూటింగ్ సమయంలో ఆయన కుటుంబ సమేతంగా తన ఇంటికి వచ్చారని తెలిపారు. ఆ సమయంలోనే గాయత్రిని చూశానన్నారు. రాజేంద్రప్రసాద్ తరచూ ఫోన్‌లో మాట్లాడుతుంటారన్నారు. గాయత్రి గుండెపోటుతో చనిపోయిందని విని మా కుటుంబమంతా చాల బాధపడ్డామన్నారు. మా ఇంటికొచ్చిన సమయంలో గాయత్రి మాతో గడిపిన క్షణాలు గుర్తొస్తున్నాయన్నారు. హైదరాబాద్ వెళ్లి రాజేంద్రప్రసాద్‌ను పరామర్శిస్తానని మధుబాబు తెలిపారు.

మొగల్తూ గ్రామస్తులకు తాగునీరందించండి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాలన్

ప్రజాశక్తి - పాలకోడేరు

మండలంలోని మొగల్లు గ్రామంలో ప్రజలు తాగునీరు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం పంచాయతీ ద్వారా తాగునీరు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్వి.గోపాలన్ డిమాండ్ చేశారు. స్థానిక మొగల్లులో అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం గ్రామ శాఖ మహాసభ ఆ పార్టీ నాయకులు వీరవల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. తెలంగ సత్తి, కొడవలి, నక్షత్రం గుర్తు ఉన్న అరుణ పతాకాన్ని సీనియర్ నాయకులు కనికెట్టి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై గోపాలన్ మాట్లాడుతూ మొగల్లు గ్రామంలో తాగునీరు సరిగ్గా అందక ప్రజలు నానాఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో కాలువ్యాన్ని అరికట్టాలన్నారు. అక్కా చెరువుల వల్ల కొత్త కాలిని పూర్తిగా ముంపునకు గురవుతుందని తెలిపారు. అక్కా చెరువుల నుంచి వచ్చే వ్యర్థాలు దళిత పేటల వైపు మళ్లించడంతో అరుంధతిపేట పూర్తిగా ముంపునకు గురవుతున్నదన్నారు. గ్రామంలో ఉన్న రెండు దళిత పేటల్లో డ్రైనేజీ వ్యవస్థ లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షపు నీరు రోడ్లపైనే నిలుస్తూ సీజనల్ వ్యాధులకు గురవుతున్నారన్నారు. తక్షణం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శేషపు అక్కయ్య, గ్రామ కార్యదర్శి గాతల వెంకటస్వామి, నాయకులు గుత్తుల బాబూరావు, గెద్దాడ వెంకటేశ్వరరావు, వీరవల్లి పవన్ నాగ పాల్గొన్నారు.

శ్మశానవాటికకు వెళ్లే రోడ్డు నిర్మించాలి

గణపవరం :కేశవరంలో శ్మశానవాటికకు వెళ్లే రహదారిని వెంటనే నిర్మించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎ స్థానిక నాయకులు నరాలశెట్టి రామకృష్ణ ఇంటివద్ద సిపిఎం కేశవరం మహాసభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, మండల కార్యదర్శి పి.నరసింహమూర్తి మాట్లాడుతూ గ్రామంలో శ్మశానవాటికకు రహదారి నిర్మించక పోవడం వల్ల గ్రామంలో ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలు చేయడానికి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. స్థానికంగా ఉన్న వార్డుల్లో నిర్మించాలని కోరారు. వర్షం వస్తే నీరు ఎటు వెళ్లకపోవడంతో ప్రజలు నాన అవస్థలు పడుతున్నారన్నారు. ఉండి కాల్వపై నిర్మించిన బెయిలు వంతెన శిథిలావస్థకు చేరిందని, వెంటనే కొత్తగా వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం కేశవరం ఒకటో శాఖా కార్యదర్శిగా నరాలశెట్టి రామకృష్ణ, మహిళాశాఖ కార్యదర్శిగా పి.లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహాసభలో పి.ఓంకారయ్య, వలవలపల్లి వీరభద్రరావు, తోట మహాలక్ష్మి, ఎర్రాని సాయి, పీతల సామ్యూల్, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు సక్రమంగా నిర్వర్తించండి

భీమవరం ఆర్‌డిఒ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఉండి

నవంబర్ మూడో వారంలో ఉండి మండలంలో జరిగే ధాన్యం కొనుగోలు ఎటువంటి అవకతవకలు లేకుండా సక్రమంగా నిర్వర్తించాలని, రైతులకు కొనుగోలు సిబ్బంది అందుబాటులో ఉండాలని భీమవరం రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వరరావు గ్రామస్థాయి అధికారులను సూచించారు. శనివారం ఉండి ఎంపిడిఒ కార్యాలయంలో తహశీల్దార్ కావటి నాగార్జున అధ్యక్షతన నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రవీణ్ కుమార్ రెడ్డి, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఖరీఫ్ 2024-25 పంట కాలానికి నవంబర్ మూడో వారంలో కోతలు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. కొనుగోలు సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి ధాన్యం కొనుగోలు సక్రమంగా నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో అనుసరించాల్సిన విధి విధానాలను కమ్పితంగా వారు తెలియజేశారు. వివరించారు. ఆదేవిధంగా సాధారణ రకం పంట క్వింటా రూ.2,300, గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటా రూ.2,320 రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కెవిఎస్ఎస్.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి బి.సంధ్య, పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ ఎం.మహేశ్వరరావు, గ్రామ రెవెన్యూ అధికారులు, ధాన్యం కొనుగోలు సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం : రైతు తాను కోరిన రైస్ మిల్లుకే ధాన్యాన్ని విక్రయించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని ఆర్‌డిఒ దాసిరాజు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శనివారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి రైతులకు మెరుగైన 'సేవలు' అందించాలన్నారు.

గణపవరం : ధాన్యం కొనుగోలు ప్రక్రియపై శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ 24-25కు గాను కామన్ ధాన్యం క్వింటాలు రూ.2,300, గ్రేడ్ ఎ ధాన్యం క్వింటాలు రూ.2,320, కనీస మద్దతు ధర నిర్ణయించినట్లు చెప్పారు. ఏ రైతు కూడా కనీస మద్దతు ధరకన్నా తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన అవసరం లేదన్నారు. గత ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొన్న సమస్యలు దృష్టిలో ఉంచుకుని రైతు నచ్చిన రైసుమిల్లుకు తోలుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ధాన్యం అమ్మిన రైతులు ప్రభుత్వం 48 గంటల్లో సొమ్ము చెల్లిస్తుందన్నారు. ధాన్యం అమ్మకంలో ఎటువంటి మోసాలు లేకుండా రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వై.అప్పారావు, ఎఒ వై.ప్రసాద్, ఎంఎల్ఒ దాస్, రైసు మిల్లర్లు, వివిఎలు, విఆర్‌ఒలు, ధాన్యం కొనుగోలు సిబ్బంది పాల్గొన్నారు.

36,342 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

పెనుమంట్ర : ఈ ఖరీఫ్ 2024 సీజన్‌లో పెద్ద లక్ష్యం పెట్టుకుని ధాన్యం సేకరణ జరగాలని తహశీల్దార్ వై.రవికుమార్ అన్నారు. బ్రాహ్మణచెరువులోని మండల ప్రజా పరిషత్ మీటింగ్ హాలులో ధాన్యం సేకరణపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ 2024 సంబంధించి ధాన్యం కొనుగోలులో ఆయా సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు నాణ్యత ప్రమాణాలను అనుసరించాలని, ధాన్యం సేకరణ చేయాలన్నారు. ఈ ధాన్యం సేకరణలో ఖరీఫ్‌లో పెనుమంట్ర మండలానికి 36,342 మెట్రిక్ టన్నుల లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. దీనికి అనుగుణంగా రైతు సేవా కేంద్రాల్లో నిర్వహించే ఈ ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగే విధంగా ముందుగానే ధాన్యం సేకరణలో కావాల్సిన గోనెసంచులను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ డివిఎస్.శర్మ, మండల వ్యవసాయ అధికారిణి ఎ.జ్యోతిరమణి, సహకార శాఖ సబ్ రిజిస్ట్రార్ రెహమాన్, పలువురు రైస్ మిల్లర్స్, ఎఇఒ, సొసైటీ సిఇఒలు, విఎఎలు, టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.


ఉండి : మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వరరావు

వీరవాసరం : సార్వా ధాన్యం కొనుగోలుకు సంబంధించి తహశీల్దార్ కార్యాలయంలో విఎఎ విఆర్‌ఒ, టెక్నికల్ అసిస్టెంట్ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులు పండించిన ధాన్యాన్ని రైతు సేవ కేంద్రం ద్వారా అమ్ముకోవాలంటే ముఖ్యంగా నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండాలని తెలిపారు. రైతు తన ధాన్యాన్ని ఇష్టమైన మిల్లుకు ఆర్ఎస్‌కె ద్వారా అమ్ముకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఒఒ చింతల శ్రీనివాస్, తహశీల్దార్ ఎవి.రామాంజనేయులు, కో-ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ వసుంధర, మండల వ్యవసాయాధికారి ఎన్‌బి.బిస్మీబాబు పాల్గొన్నారు.

ఆచంట : రైతు కేంద్రాలు, సహకార పరపతి సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేస్తామని, రైతులు తాము పండించిన పంటను నచ్చిన మిల్లర్లకు అమ్ముకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తహశీల్దార్ ఎం.సోమేశ్వరరావు అన్నారు. సార్వా ధాన్యం కొనుగోలుపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం ఆయన అధ్యక్షతన జరిగింది. వ్యవసాయాధికారి బి.నాగరాజు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భాగస్వాములైన ఆర్ఎస్‌కె ఇన్‌ఛార్జిలు, టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లు నిబంధనలకు లోబడి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక నిపుణులు కె.చంద్రకాంత్, సివిల్ సప్లై అధికారి వి.సునీల్ కుమార్, ఎంఎల్ఎస్ ఇన్‌ఛార్జి, సొసైటీ సెక్రటరీ, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని గోదావరి తీర ప్రాంతాల నుంచి ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవని.. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆచంట తహశీల్దార్ ఎం.సోమేశ్వరరావు తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోడేరు, కరుగోరుమిల్లి, అయోధ్యలంక గ్రామాల నుంచి ఇసుక అక్రమంగా తరలిపోకుండా గ్రామాల్లో వద్ద సంబంధిత విఆర్‌ఒ, విఆర్‌ఎలతో నిఘా ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఇసుక అవసరమైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వారి అవసరాలు పరిశీలించిన తర్వాత వారు అనుమతులు ఉన్న ర్యాంపుల నుంచి ఇసుక తెచ్చుకోవడానికి అనుమతులు మంజూరు చేస్తామని తహశీల్దార్ అన్నారు. అక్టోబర్ నెలాఖరు నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.